# సాక్షి
## అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 7 । ఫిబ్రవరి । 2025






### అధికారమే.. అండగా!
అధికారమే అండగా టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. అధికారులు సైతం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా వేధింపులకు పాల్పడుతున్నారు. - 8లో



### త్వరలో ఉద్యాన పరిశోధనలు
బయ్యప్పగారిపల్లి ఉద్యాన పరిశోధన కేంద్రంలో త్వరలో పరిశోధనలు ప్రారంభమవుతాయని వైఎస్‌ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ తెలిపారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.180 | రూ.230 |
| రెండోరకం | రూ.120 | రూ.170 |

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 41 మెట్రిక్ టన్నులు



## న్యూస్‌రీల్

### కడప కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ నియామకం



రాజేశ్వరరావు

**కడప అర్బన్:** కడప కేంద్ర కారాగారం పర్యవేక్షణ అధికారిగా రాజేశ్వరరావును నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఈయన కడప కేంద్ర కారాగారం ఇన్‌చార్జి అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ పనిచేసిన ప్రకాష్‌ను నెల్లూరుకు బదిలీ చేసి అక్కడ పనిచేస్తున్న రాజేశ్వరరావుకు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. అయితే ఆయనను రెగ్యులరైజ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

### యాంత్రీకరణ పరికరాలకు టెండర్ల ఆహ్వానం

**రాయచోటి జగదాంబసెంటర్:** అన్నమయ్య జిల్లాలో పట్టు రైతులకు సరఫరా చేసేందుకు అవసరమైన వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు కొనుగోలు చేసేందుకు ఉత్పత్తిదారుల నుంచి సీల్డ్ టెండర్లు కోరుతున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్, జిల్లా కొనుగోలు కమిటీ చైర్మన్ ఆదర్శ్ రాజేంద్రన్ ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు అన్నమయ్య జిల్లా పట్టు పరిశ్రమల శాఖ అధికారి 9966153900 నంబర్‌లో కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలన్నారు. ఈ నెల 6 నుంచి 13వ తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోగా టెండర్లు దాఖలు చేయవచ్చన్నారు.

### ఇంటర్ ప్రాక్టికల్స్ పక్కాగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఇంటర్ ఆర్జేడీ రవి

**కడప ఎడ్యుకేషన్:** జిల్లావ్యాప్తంగా ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభమయ్యే జనరల్ ప్రాక్టికల్ పరీక్షలను పక్కాగా నిర్వహించాలని ఇంటర్మీడియేట్ ఆర్జేడీ రవి పేర్కొన్నారు. గురువారం కడపలోని సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రాక్టికల్స్‌కు సంబంధించి సైన్స్ జూనియర్ లెక్చరర్లకు పరీక్షల విధి విధానాలు, మార్కుల గురించి ఇంటర్ ఆర్ఐఓ బండి వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ జిల్లాలో 14 పరీక్షా కేంద్రాల్లో ఒకేషనల్ ప్రాక్టికల్స్ జరుగుతున్నాయన్నారు. పదోతేదీ నుంచి జనరల్ ప్రాక్టికల్స్ ప్రారంభమవుతాయన్నారు. జనరల్ ప్రాక్టికల్స్‌కు జిల్లాలో 78 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఇంటర్ ఆర్ఐఓ బండి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ప్రాక్టికల్ ఎగ్జామ్స్ ఇంటర్‌బోర్డు ఆదేశానుసారం జరపాలని లెక్చరర్స్‌కు సూచించారు. పరీక్షల నిర్వహణలో ఎక్కడా ఆరోపణలకు తావు లేకుండా చూడాలన్నారు. జిల్లా స్పెషల్ ఆఫీసర్ మురళీ, డీసీ మెంబర్స్ ప్రాక్టికల్స్ గురించి సూచనలు, సలహాలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సైన్స్ అధ్యాపకులు పాల్గొన్నారు.

● 60 ఏళ్ల అనుబంధం

# ఒక్క నిర్ణయంతో అంతం

- దక్షిణ మధ్య రైల్వేతో తెగిన ఆరు దశాబ్దాల అనుబంధం
- జోన్ హద్దులపై రైల్వేబోర్డు స్పష్టత
- గుంతకల్ డివిజన్ సౌత్‌కోస్ట్ జోన్‌లోకి బదిలీ
- ఇకపై విశాఖ జోన్ కేంద్రంగానే రైల్వేపాలన
- కొత్త జోన్‌లో విలీనంపై రైల్వే కార్మికుల్లో అసంతృప్తి





ముంబయి - చెన్నై రైలు మార్గంలోని కడప రైల్వేస్టేషన్

**రాజంపేట:** ఆరు దశాబ్దాల తర్వాత ఉమ్మడి తెలుగు రాష్ట్రాల పరిధిలో ఉన్న దక్షిణ మధ్య రైల్వే(సౌత్ సెంట్రల్ రైల్వే) జోన్‌తో రాయలసీమ సీమ రైల్వేలకు కేంద్రంగా ఉన్న గుంతకల్ రైల్వే డివిజన్ బంధం తెగిపోనుంది. ముంబయి–చెన్నై ప్రధాన రైలు మార్గం కడప, అన్నమయ్య జిల్లాల మీదుగా వెళుతోంది. సౌత్‌కోస్ట్ రైల్వేజోన్ ఏర్పాటు కానున్న నేపథ్యంలో సరిహద్దులపై రైల్వేబోర్డు స్పష్టత ఇచ్చేసింది. ఇందులో భాగంగా రైల్వే మంత్రిత్వశాఖ విశాఖ కేంద్రంగా పనిచేసే సౌత్ కోస్ట్ రైల్వేజోన్‌లోకి గుంతకల్ డివిజన్‌ను విలీనం చేసే దిశగా చర్యలకు ఉపక్రమించింది. ఈ మేరకు ఉత్తర్వులు కూడా వెలువడ్డాయి. కాగా ప్రస్తుతం గుంతకల్ డివిజన్ పరిధిలోని రాయచూరు నుంచి వాడి (వాడి మినహా) రైల్వేసెక్షన్‌ను సికింద్రాబాద్ డివిజన్‌లోకి మార్చే అవకాశాలు ఉన్నాయి.

**విశాఖ జోన్‌లోకి బదిలీపై వ్యతిరేకత**

విశాఖ జోన్‌లో గుంతకల్ డివిజన్ విలీనంపై కార్మికుల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. డివిజన్ కేంద్రం నుంచి సౌత్‌కోస్ట్ జోన్ కేంద్రమైన విశాఖకు వెళ్లాలంటే 700 కిలోమీటర్ల ప్రయాణం చేయాల్సి ఉంటుంది. జోన్‌కు వెళ్లి రావాలంటే కనీసం ఐదు రోజులు పడుతుంది. ప్రస్తుత జోన్ కేంద్రానికి వెళ్లాలంటే 200 కిలోమీటర్ల దూరం ఉంది. విశాఖ జోన్ వద్దు..సికింద్రాబాద్ జోన్ ముద్దు అంటూ కార్మికులు నినదిస్తున్నారు.

**ఉమ్మడి వైఎస్సార్ జిల్లా రైలు మార్గాల చరిత్ర**

| మార్గం | సంవత్సరం |
|---|---|
| రేణిగుంట–రెడ్డిపల్లె | 1864 |
| రెడ్డిపల్లె–కడప | 1865 |
| కడప–ముద్దనూరు | 1866 |
| ముద్దనూరు–తాడిపత్రి | 1898 |



### రైల్వే డివిజన్ చరిత్ర...





దక్షిణ రైల్వే జోన్‌లో భాగంగా గుంతకల్లు రైల్వే డివి జన్ 1956 సంవత్సరంలో రూపొందించారు. దీనిని 1997 అక్టోబరు 2న దక్షిణ మధ్య రైల్వేజోన్‌కు బదిలీ చేశారు. ఏపీ, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలలో ప్రజలకు తన సేవలందిస్తూ వచ్చింది. ఇప్పుడు సౌత్‌కోస్ట్ జోన్‌లోకి వెళ్లిన తర్వాత సరిహద్దులు మార్పులు చేర్పులు జరగబోతున్నాయి.

**ప్రస్తుత పరిధి:** ఆంధ్రప్రదేశ్‌లో 120.51 రూట్ కి.మీ దూరం, కర్ణాటకలో 142.2 రూట్ కి.మీ దూరం పరిధి, తమిళనాడులో 6.86 కి.మీ మొత్తం దూరం పరిధి ఉంది. గుంతకల్లు జంక్షన్, రేణిగుంట జంక్షన్, కడప, అనంతపురం, యాదగిరి, రాయచూరు, చిత్తూరు, ధర్మవరం, గుత్తి, పాకాల, నందలూరు, డోన్, ఆదోని, మంత్రాలయం, శ్రీకాళహస్తి, కదిరి, తాడిపత్రి, ఎర్రగుంట్ల, రాజంపేట, కోడూరు, నారాయణపేటరోడ్, వెంకటగిరి, కృష్ణా, నల్వార్‌లతోపాటు 90 స్టేషన్లు ఉన్నాయి. విశాఖజోన్ కేంద్రంగా రైల్వేపాలన జరగనుంది. ప్రస్తుత అధికార పరిధిలో కూడా మార్పులు జరగనున్నాయి.

#### గుంతకల్ రైల్వే డివిజన్ చరిత్ర అపూర్వం



రాయలసీమ రైల్వేలకు నిలయమైన గుంతకల్ రైల్వేడివిజన్ చరిత్ర అపూర్వం. దక్షిణమధ్య రైల్వేకి ఆదాయం తీసుకొచ్చే డివిజన్‌గా పేరుంది. ఆరు దశాబ్దాలుగా గుంతకల్ రైల్వే డివిజన్ దక్షిణ మధ్యరైల్వేలో ఉండి సేవలందించింది. అన్ని విధాలుగా గుంతకల్ డివిజన్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. సౌత్ సెంట్రల్ రైల్వేజోన్‌తో ఉన్న అనుబంధం ఆరు దశాబ్దాల తర్వాత తెగిపోతుండటం విచారకరం.

– బీఎంబాషా, డివిజన్ ప్రెసిడెంట్, మజ్దూర్ యూనియన్, గుంతకల్

#### కొత్త జోన్‌తో పాటు బాలాజీ డివిజన్ ఏర్పాటు చేయాలి



విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ జోన్ ఏర్పాటు కానున్న నేపథ్యంలో బాలాజీ డివిజన్‌ను ఏర్పాటు చేయాలి. దక్షిణ మధ్య రైల్వే నుంచి గుంతకల్ డివిజన్ సౌత్ కోస్ట్ జోన్‌లోకి వెళుతోంది. అలాంటప్పుడు కడప వరకు తిరుపతి కేంద్రంగా బాలాజీ డివిజన్‌ను తీసుకు రావాల్సిన అంశంపై పాలకులు దృష్టి సారించాలి. ఇప్పటికే ఎంపీలు పీవీ మిథున్‌రెడ్డి, గురుమూర్తి, మేడా రఘునాథరెడ్డిలు తిరుపతి బాలాజీ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరారు.

–తంబళ్ల వేణుగోపాల్‌రెడ్డి, డీఆర్‌యూసీసీ సభ్యుడు, రాజంపేట

#### గుంతకల్ డివిజన్‌కు ఘనమైన చరిత్ర



గుంతకల్ డివిజన్‌కు ఆరు దశాబ్దాల ఘనమైన చరిత్ర ఉంది. ముంబయి–చెన్నై ప్రధాన రైలుమార్గం వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల మీదుగా వెళుతోంది. ఇప్పుడు సౌత్‌కోస్ట్ జోన్‌లోకి డివిజన్ బదిలీ చేసేందుకు రైల్వేబోర్డు సర్వం సిద్ధం చేస్తోంది. అలాంటప్పుడు బాలాజీ డివిజన్ ఏర్పాటుచేసి, కనీసం నందలూరు వరకు తీసుకోవాలన్న ప్రతిపాదనను రైల్వేబోర్డు పరిశీలించాలి. గతంలో సదరన్ రైల్వేతో నందలూరుకు ప్రత్యేక అనుబంధం ఉంది. అది గుర్తించాలి.

–తల్లెం భరత్‌రెడ్డి, డీఆర్‌యూసీసీ సభ్యుడు, రైల్వేకోడూరు

### పేదరికం నిర్మూలనకు పటిష్ట కార్యాచరణ

జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

**రాయచోటి:** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా సున్నా పేదరికం – పి 4 పాలసీకి అనుగుణంగా నియోజకవర్గస్థాయి ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం విజయవాడ నుంచి సున్నా పేదరికం – పి4 విధానం,నియోజకవర్గ అభివృద్ధి విజన్ ప్రణాళికల తయారీ, కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ల ఏర్పాటు కోసం భూముల గుర్తింపు, ఎంఎస్ఎంఈ సర్వే అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాయచోటి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పి4 పాలసీ రూపొందించడానికి తీసుకోవాల్సిన అంశాలు, జిల్లాలో చేపట్టాల్సిన చర్యలు తదితరాలపై సమావేశంలో పవర్ పాయింట్ ద్వారా అవగాహన కల్పించారు. అలాగే జిల్లాలలో జరుగుతున్న ఎంఎస్ఎంఈ సర్వే ప్రగతిపై సమీక్షించారు. 86 శాతంతో అన్నమయ్య జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉండడంపై అభినందించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ పేదరికం నిర్మూలనకు ప్రభుత్వ ఆశయాలకనుగుణంగా పటిష్టమైన కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. బయో గ్యాస్ ప్లాంట్ ఏర్పాటు నిమిత్తం ప్రతి మండలంలో ప్రభుత్వ, అసైన్డ్ భూములను గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ మధుసూదన్ రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# హోరాహోరీగా క్రీడా పోటీలు

నేడు ముగింపు ఉత్సవం

**రైల్వేకోడూరు అర్బన్:** రైల్వేకోడూరు మండలంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయం పరిధిలోని అనంతరాజుపేట కళాశాలలో నిర్వహిస్తున్న 11వ క్రీడా, సాంస్కృతిక పోటీలు గురువారం ఉత్కంఠ భరితంగా సాగాయి. కబడ్డీ, బ్యాడ్మింటన్, త్రోబాల్, టేబుల్ టెన్నిస్, పరుగు, హైజంప్ పోటీలు నిర్వహించారు. అనంతరాజుపేట బాలికల జట్టు కబడ్డీలో ఫైనల్స్‌కు చేరింది. అలాగే బాలుర వాలీబాల్, బాలికల త్రోబాల్‌లో కూడా ఇదే కళాశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. నాలుగు వందల మీటర్ల బాలుర పరుగు పందెంలో వీఆర్ గూడెం విద్యార్థి అనిల్ కుమార్ విజేతగా నిలిచాడు.

- బాలికల నాలుగు వందల మీటర్ల పరుగు పందెంలో వీఆర్ గూడెంకు చెందిన యమున, అనూష, అనంతరాజుపేటకు చెందిన షమీరా మొదటి మూడు బహుమతులు గెలుచుకున్నారు.



ఉత్కంఠ భరితంగా సాగిన కబడ్డీ పోటీలు

**నక్షత్ర వాటిక ప్రారంభం**

డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ ప్రాంగణంలో వైస్ చాన్సలర్ డాక్టర్ గోపాల్ ఆధ్వర్యంలో నక్షత్ర వాటికను ప్రారంభించి నక్షత్రానికి అనుగుణంగా చెట్లు నాటారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సూరికుమారి, సదరున్నీసా, దీప్తి కిరణ్, రామయ్య, లలిత తదితరులు పాల్గొన్నారు.

# చక్రస్నానం.. సర్వపాపహరణం

వైభవంగా ధ్వజావరోహణం

**కడప కల్చరల్:** దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 9వ రోజు గురువారం స్వామి, అమ్మవార్లకు అవభృథ స్నానం, సుదర్శన చక్రత్తాళ్వార్‌కు తీర్థస్నానం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం నుంచి మేళతాళాలతో ప్రత్యేక పల్లకీలో స్వామి, అమ్మవార్లతోపాటు శ్రీ చక్రాన్ని ఊరేగింపుగా పుష్కరిణి మండపానికి చేర్చారు. అక్కడ రెండున్నర గంటలపాటు వేద మంత్ర యుక్తంగా స్వామి, అమ్మవార్లకు పంచామృతం,ఇతర ద్రవ్యాలతో అభిషేకించారు. వేద పండితుల మంత్రోచ్చాటనల మధ్య కార్యక్రమాలను ప్రారంభించారు. తొలుత చందన లేపనం, నారికేళ జలాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుల బృందం పాలు, పెరుగు, తేనె, శుద్ధ జలాలతో కూడా ప్రత్యేకంగా అభిషేకం చేశారు. వట్టివేర్లతో ప్రత్యేకంగా దండలను స్వామి, అమ్మవార్లకు అలంకరించడం విశేషం. అనంతరం ఉత్సవమూర్తులను చక్రత్తాళ్వార్‌తోపాటు పుష్కరిణిలోకి తీసుకెళ్లారు. గోవిందనామ స్మరణలు, భక్తుల కోలాహలం మధ్య మూలమూర్తులతోసహా అర్చకులు పుష్కరిణిలో మూడు మునకలు వేశారు. భక్తులు తాము కూడా పుష్కరిణిలో మునకలు వేసి పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను అలంకరించి ఊరేగింపుగా ఆలయానికి చేర్చారు. స్వామి ప్రత్యేక ప్రసాదంగా ఉత్సవ మూర్తులకు లేపనం చేసిన సుగంధం, తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం రాత్రి వేద మంత్రోచ్చాటనల మధ్య ఆలయ ప్రాంగణంలో గరుడ పతాకాన్ని ధ్వజావరోహణం చేశారు. దీంతో కడప రాయుని బ్రహ్మోత్సవాలు ముగిశాయి.



పుష్కరిణిలో చక్రస్నానం చేయిస్తున్న వేద పండితులు

**నేడు పుష్పయాగం:** బ్రహ్మోత్సవాలు ముగిసిన సందర్భంగా శుక్రవారం స్వామి, అమ్మవార్లకు పుష్పయాగం నిర్వహించనున్నారు. ఉదయం స్నపన తిరుమంజనం చేయనున్నారు. సాయంత్రం 6 నుంచి టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు అన్నమాచార్యుల కీర్తనలు ఆలపించనున్నారు. రాత్రి 9 గంటల సమయంలో ఆలయ ప్రాంగణంలోని అమ్మవారి సన్నిధిలో పుష్పయాగం నిర్వహించనున్నారు.

- జిల్లాలో పెరుగుతున్న ఆత్మహత్యలు
- పదిరోజుల్లో ఇద్దరు విద్యార్థినుల బలవన్మరణం
- మూడు నెలల్లో 69 మంది మృత్యు ఒడికి

# క్షణికావేశం.. తీరని శోకం



ఈ ప్రపంచంలో అత్యంత విలువైనది, వెలకట్టలేనిది ప్రాణం. జీవితం అన్నాక ఎన్నో ఒడిదుడుకులు, సమస్యలు ఎదురవుతుంటాయి. జీవితంలో మనిషికి అతి పెద్ద సమస్య 'చావు'. సరిగ్గా ముప్పెప్పేళ్ల క్రితం వచ్చిన నిన్నేపెళ్లాడుతా సినిమాలోని ఓ డైలాగ్ ఎంతో ఆలోచింపచేస్తుంది. ఆ సినిమాలో హీరో నాగార్జున 'చావుముందు మిగతా సమస్యలన్ని దూదిపింజెల్లాంటివి' అని చెబుతాడు. అయితే ఇటీవల కాలంలో జిల్లాలో ఆత్మహత్యలు చేసుకునేవారి సంఖ్య పెరిగిపోతుండటం ఆందోళన కలిగించే పరిణామం. కేవలం మూడు నెలల్లోనే 69 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. పదిరోజుల వ్యవధిలో రాజంపేటలో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్యలు చేసుకోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది.



ఇటీవల రాజంపేటలో ఆత్మహత్య చేసుకున్న ఇంజినీరింగ్ విద్యార్థిని అఖిల

**రాజంపేట టౌన్:** ఎంతపెద్ద సమస్య అయినా పరిష్కరించుకునేందుకు ఏదో ఒక మార్గంలో అవకాశాలు ఉన్నాయి. అయితే చిన్నచిన్న సమస్యలకే అనేక మంది మనోస్థైర్యాన్ని కోల్పోయి బలవంతంగా తమ చేతులతోనే ప్రాణాలను తీసుకుంటున్నారు. తనువు చాలించుకోవడానికి సిద్ధమయ్యాక ఒక్క క్షణం జన్మనిచ్చి కంటికి రెప్పలా చూసుకుంటున్న తల్లిదండ్రులను, అక్క, చెల్లి, అన్నయ్య, తమ్ముడు అంటద్యాప్యాయతతో, ప్రేమానురాగాలతో పిలిచే తోబుట్టువులను, తమపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులను ఒక్కసారి గుర్తు తెచ్చుకుంటే ఎంత కష్టాన్ని అయినా అలవోకగా జయించవచ్చు.

**చిన్నపాటి కారణాలతో ఆత్మహత్యలు**

తల్లిదండ్రులు మందలించారని, పరీక్షల్లో ఉత్తీర్ణులు కాలేక పోతున్నామని, ప్రేమ విఫలమైందని, చివరికి తల్లిదండ్రులు సెల్‌ఫోన్ చూడవద్దు అన్నందుకు కూడా ఇటీవల విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇక కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యలు, అనారోగ్య సమస్యలు, వ్యసనాలకు బానిసలు కావడం, భర్త కోప్పడ్డాడనో, పుట్టింటికి పంపలేదనో, సినిమాకు, షాపింగ్‌కు తీసుకెళ్లలేదనో భార్య, భార్య కాపురానికి రాలేదని భర్త ఇలా చిన్నచిన్న విషయాలకే విభేదాలు, గొడవలు, ఉద్వేగం, కుంగుబాటుకు గురై ఆత్మహత్యలు చేసుకుంటున్న సంఘటనలు అధికమవుతున్నాయి. ఆత్మహత్యకు పాల్పడే వారంతా సమస్యకు పరిష్కారం వెతుక్కునే సామర్థ్యం లేక, సమస్య పరిష్కారానికి కొంత సమయమైనా వేచిచూసే ఆత్మస్థైర్యం లేనందు వల్ల అర్థంతరంగా తనువు చాలిస్తూ కన్నవారిని, నమ్ముకున్న వారిని పుట్టెడు దుఃఖంలోకి నెడుతున్నారు.

**అవగాహన లేక పోవడమే ప్రధాన కారణం**

సమస్యలు ఎదురైనప్పుడు క్షణికావేశమే చాలా సందర్భాల్లో బలవన్మరణాలకు దారితీస్తుంది. జీవితంపై, సమస్యలు పరిష్కరించుకునే విధానంపై సరైన అవగాహన లేక పోవడమే ఆత్మహత్యలు చేసుకోవడానికి ప్రధాన కారణం. ఆత్మహత్యలు చేసుకునే వారు సమస్యను తప్పించుకోవాలని చూస్తున్నారే తప్ప తమ కుటుంబ సభ్యులను మరింత సమస్యల్లోకి నెట్టేస్తున్నామన్న విషయాన్ని గుర్తించలేక పోతున్నారు. తల్లిదండ్రులు కన్నబిడ్డలను ఎంతో అల్లారు ముద్దుగా పెంచుకుంటారు. అలాంటప్పుడు కన్నబిడ్డ ఆత్మహత్య చేసుకుంటే ఆ తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తారు. జీవితాంతం మానసిక క్షోభను అనుభవిస్తారు. ఇక కుటుంబ పెద్ద ఆత్మహత్య చేసుకుంటే ఆ కుటుంబం పరిస్థితి అగమ్యగోచరంగా తయారవుతుంది. అందువల్ల జీవితంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకోవాలే తప్ప ప్రాణాలు తీసుకోవడం సరైనది కాదని మానసిక నిపుణులు చెబుతున్నారు.

**ఉరుకులు పరుగులమయమైన జీవనం కూడా ఒక కారణమే**

గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. ఒకరి కష్టాలను, బాధను మరొకరు పంచుకునేవారు. కుటుంబంలో ఎవరికైనా ఏదైనా సమస్య వస్తే పెద్దలు ఆ సమస్యను పరిష్కరించి మేమున్నాం అన్న భరోసా ఇచ్చేవారు. ఇప్పుడు కాలం మారింది. ఉమ్మడి కుటుంబాల స్థానంలో చిన్న కుటుంబాలు ఏర్పడ్డాయి. ప్రతి ఒక్కరిది ఉరుకులు పరుగులమయమైన జీవనమైంది. అందువల్ల కుటుంబ సభ్యులు వారంలో ఒకరోజైనా ఒకచోట కూర్చొని సరదాగా మాట్లాడుకోలేక పోతున్నారు. ఫలితంగా ఏదైనా సమస్య వచ్చినా కుటుంబ సభ్యులతో చెప్పుకొని పరిష్కరించుకోలేక వారిలో వారే కుమిలిపోయి చివరికి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

**గత మూడు నెలల్లో ఆత్మహత్యలు చేసుకున్న వారి సంఖ్య**

| నెల | ఆత్మహత్యలు చేసుకున్న వారు |
|---|---|
| నవంబర్ | 24 |
| డిసెంబర్ | 17 |
| జనవరి | 28 |
| మొత్తం | 69 |



### ఈ లక్షణాలుంటే జాగ్రత్త పడాలి..

ఆత్మహత్య చేసుకోవాలనుకునే వారిలో కొన్ని అసాధారణ లక్షణాలు ఉంటాయి.

- ఒంటరితనాన్ని కోరుకుంటారు.
- సకాలంలో ఆహారం తీసుకోరు.
- రాత్రి వేళల్లో నిద్రపోకుండా ఎక్కువగా ఆలోచిస్తుంటారు.
- కొన్నిమార్లు అసలు దేనికి కూడా స్పందించరు.
- బతికి ఏం లాభమని, చనిపోతే పోతుంది అని ముందుగానే పరోక్షంగా సంకేతాలిస్తారు. ఇలాంటి మాటలు ఎవరైనా మాట్లాడితే కుటుంబ సభ్యులు గుర్తించాలి
- వారితో ప్రేమగా మాట్లాడి సమస్యను తెలుసుకొని పరిష్కారానికి తోడ్పాటునిచ్చి తామున్నామన్న భరోసా ఇవ్వాలి.
- మానసిక వైద్యుడి వద్దకు తీసుకెళితే ప్రయోజనం కూడా ఉంటుంది.



#### తనువు చాలించడమన్నది సరైన నిర్ణయం కాదు



ఎంతటి సమస్యకైనా పరిష్కారం ఉంటుంది. తనువు చాలిస్తే సమస్య పరిష్కారం అయిపోతుందనుకోవడం సరైనది కాదు. ఏ సమస్య వచ్చినా ముందు తల్లిదండ్రులతో కాని కుటుంబ సభ్యులతో కాని అత్యంత ఆత్మీయులతో చెప్పుకొని పరిష్కారానికి ప్రయత్నించాలి. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా బతికి సాధించాలి.

– మనోజ్ రాంనాథ్ హెగ్డే, ఏఎస్పీ, రాజంపేట

### తల్లిదండ్రులకు కడుపుకోత మిగల్చవద్దు

విద్యార్థులకు ఎమ్మెల్యే ఆకేపాటి సూచన

**రాజంపేట టౌన్:** జన్మనిచ్చి కంటికి రెప్పలా చూసుకుంటూ, అల్లారు ముద్దుగా పెంచుకునే తల్లిదండ్రులకు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకొని వారికి కడుపుకోత మిగల్చవద్దని ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి సూచించారు. ఆత్మహత్య చేసుకున్న బీటెక్ విద్యార్థిని అఖిల మృతదేహాన్ని వారి ప్రాంతమైన అనంతపురం జిల్లా సి.చిక్కేపల్లి పెద్దపప్పూరుకు తీసుకెళ్లేందుకు ఎమ్మెల్యే గురువారం అంబులెన్స్ ఏర్పాటు చేయించి మృతురాలి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఆకేపాటి విలేకరులతో మాట్లాడారు.



ఆత్మహత్య చేసుకున్న ఇంజినీరింగ్ విద్యార్థిని అఖిల కుటుంబ సభ్యులకు ఆకేపాటి పరామర్శ

పదిరోజుల వ్యవధిలో రాజంపేటలో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్యకు పాల్పడటం తనను ఎంతగానో కలచివేస్తోందన్నారు. విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసుకోవద్దని చెప్పారు. మృతురాలి కుటుంబ సభ్యుల బాధను చూస్తుంటే కడుపు తరుక్కు పోతోందని తెలిపారు. ఈ ప్రపంచంలో నిస్వార్థమైన ప్రేమను, ఆప్యాయతలను పంచేది ఒక్క తల్లిదండ్రులేనన్నారు. వారు రెక్కలు ముక్కలు చేసుకుని జీవించేది కన్నబిడ్డల కోసమేనని తెలిపారు.

## క్లుప్తంగా

### ముగ్గురు ఎర్రచందనం కూలీల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ రఘురాం

చిట్వేలి : ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులో పరారీలో ఉన్న ముగ్గురు కూలీలను గురువారం కేఎస్ అగ్రహారం పంచాయతీ రాపూరు క్రాస్ రోడ్డు వద్ద అరెస్టు చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ రఘురాం వివరాలు వెల్లడించారు. రైల్వే కోడూరు మండలం కొత్తపల్లి ఎస్టీ కాలనీకి చెందిన మద్దూరు చెంచుకృష్ణ (30), వద్దోల్ల కోటి (250, మద్దూరు రమణయ్య(28)ను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రెండు గొడ్డళ్లు, ఒక రంపం, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులను రిమాండ్‌కు పంపించామని వివరించారు. సమావేశంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### హోటల్‌లో తనిఖీలు



నాలుగు ఇండేన్ గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్న కమర్షియల్ ట్యాక్స్ అధికారులు

సిద్దవటం : మండలంలోని కడప–చెన్నై జాతీయ రహదారి పక్కన చాముండేశ్వరీపేట గ్రామ సమీపంలో ఉన్న బాలాజీ ఫ్యామిలీ రెస్టారెంటు హోటల్‌లో గురువారం డిప్యూటీ కమర్షియల్ ట్యాక్స్ అధికారిణి గీతవాణి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ హోటల్‌లో 4 ఇండేన్ గ్యాస్ సిలిండర్‌లను గుర్తించి సీజ్ చేశామన్నారు. హోటల్ యజమాని ప్రవీణ్‌కుమార్‌పై కేసు నమోదు చేశామన్నారు. ఈ సిలిండర్లను గ్యాస్ ఏజెన్సీ వారికి అప్పగించామన్నారు. రెస్టారెంటు హోటళ్లలో ఇండేన్ గ్యాస్ సిలిండర్లను ఉపయోగించకూడదని అన్నారు. ఈ తనిఖీల్లో సివిల్ సప్లయ్ తహసీల్దారు సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

### బైక్‌లు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన గంగాధర్

గాలివీడు : మండల కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద గురువారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక ఓ ప్రైవేటు పాఠశాలలో పని చేస్తున్న వెంకటేశ్వర్లు, నవీన్ బైక్‌పై వెళుతూ మలుపు వద్ద యూ టర్న్ తీసుకుంటుండగా.. గోరాన్ చెరువు గ్రామం దాసరివాండ్లపల్లెకు చెందిన ఆవులకుంట సహదేవ్ కుమారుడు గంగాధర్ వెనుక నుంచి వేగంగా బైక్‌పై వచ్చి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో గంగాధర్ ఒక్కసారిగా ఎగిరి పడి పక్కనే నిలిచివున్న సిమెంట్ కలిపే వాహనం కిందికి దూరిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స కోసం రాయచోటికి ప్రైవేటు వాహనంలో తరలించారు.

### అక్రమ మద్యం పట్టివేత

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : అక్రమ మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కృష్ణకుమార్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నగరంలోని ఎన్‌జీవో కాలనీకి చెందిన కొత్తపల్లి శ్రీనివాసులురెడ్డి, పైడి కాల్వ బాబు చంద్రన్ డిఫెన్స్ మద్యం అమ్ముతున్నట్లు తమకు సమాచారం రావడంతో దాడులు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 80 (750ఎంఎల్) ఫుల్ బాటిళ్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

# అధికారమే.. అండగా..

- టీడీపీ నేతల వేధింపులు
- దళిత నాయకుడి వాటర్ ప్లాంట్ కూల్చివేతకు యత్నం
- మాసాపేటలో ఉద్రిక్తత
- ఏ ఉత్తర్వులు లేకుండా దండెత్తిన అధికారులు
- అడ్డుకున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, నాయకులు
- ఉదయం నుంచి సాయంత్రం వరకు హైడ్రామా



వాటర్ ప్లాంట్ వద్ద గుమికూడిన కాలనీ వాసులు



అధికారులు, పోలీసులతో మాట్లాడుతున్న మాట్లాడుతున్న మేయర్, వైఎస్సార్‌సీపీ నేతలు



వాటర్ ప్లాంట్‌ను కూల్చి వేసేందుకు సిద్ధంగా ఉంచిన జేసీబీ

కడప కార్పొరేషన్ : అధికారమే అండగా టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. వారి ఆదేశాల మేరకు అధికారులు.. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా వేధింపులకు పాల్పడుతున్నారు. తాజాగా మాసాపేటలో వైఎస్సార్‌సీపీ 26వ డివిజన్ ఇన్‌చార్జి త్యాగరాజు ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంటును కూల్చివేసేందుకు టౌన్ ప్లానింగ్ అధికారులు యత్నించడం ఉద్రిక్తతకు దారితీసింది. ఎలాంటి ఉత్తర్వులు లేకుండా, ముందస్తు నోటీసులు జారీ చేయకుండా వాటర్ ప్లాంటును కూల్చివేసేందుకు గురువారం ఉదయం సిటీప్లానర్ రమణ, ఏసీపీ మునిరత్నం ఆధ్వర్యంలో టౌన్‌ప్లానింగ్ కార్యదర్శులు, సిబ్బంది మాసాపేటపైకి దండెత్తారు. వీరికి పోలీసులు అండగా నిలిచారు. అధికారుల ఏకపక్ష చర్యలపై వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, నాయకులకు.. టౌన్‌ప్లానింగ్, పోలీసు అధికారులకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. ఉదయం నుంచి రాత్రి వరకూ అటు అధికారులు, ఇటు వైఎస్సార్‌పీపీ నేతలు మోహరించడంతో హైడ్రామా నడిచింది.

**అధికార పార్టీ నేతల ప్రలోభాలకు లొంగలేదనే..**

అధికార పార్టీ నాయకుల ప్రలోభాలకు లొంగలేదనే ఇలా కక్షసాధిస్తున్నారని 26వ డివిజన్ ఇన్‌చార్జి త్యాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. మాసాపేట ప్రాంతంలో నివసిస్తున్న వారికి ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చేందుకు గతంలో రెవెన్యూ అధికారులు సర్వే చేసి లబ్ధిదారుల ఆధార్ కార్డులను అనుసంధానం చేసి ఆన్‌లైన్‌లో ఉంచారన్నారు. తన సొంత స్థలంలో ఈ వాటర్‌ప్లాంట్ ఉందని, దీనికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నిధులు మంజూరు చేయగా, నగరపాలక సంస్థ ఇచ్చిన వర్క్ ఆర్డర్‌తో ప్లాంట్ నిర్మాణం చేయడం జరిగిందన్నారు. దీన్ని ఎలాగైనా కూల్చేందుకు టౌన్ ప్లానింగ్ అధికారులు ఉదయం నుంచి ఇక్కడే ఉన్నారని, ఇంత నీచంగా తాము చేయలేదని తెలిపారు. ఎల్లప్పుడూ అధికారం వారిదే ఉండదని టీడీపీ నాయకులు గుర్తెరగాలని హెచ్చరించారు.

**జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు**

మాసాపేట ఎస్సీ కాలనీలో దళితులకు రూ.5లకే మినరల్ వాటర్ అందిస్తున్న వాటర్‌ప్లాంటును కూల్చేందుకు టౌన్‌ప్లానింగ్ అధికారులు యత్నించిన విషయంపై జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు త్యాగరాజు తెలిపారు. తమపై దౌర్జన్యం చేసిన ప్రతి అధికారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**ఇదీ నేపథ్యం..**

మాసాపేట వాసులకు ఇంటి స్థలాలు ఇవ్వాలన్నది ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న డిమాండ్. గతంలో దీనిపై అనేక ఆందోళనలు, ఉద్యమాలు కూడా నడిచాయి. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత అప్పుడు డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న కె. సురేష్ బాబు, నగర అధ్యక్షుడిగా ఉన్న బక్కా అయ్యన్న ఆయన దృష్టికి తీసుకుపోయారు. ఇంటి స్థలాలు ఇస్తామని వైఎస్సార్ హామీ ఇచ్చారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత తండ్రి ఇచ్చిన మాట మేరకు మాసాపేట వాసులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి చిత్తశుద్ధితో కృషి చేశారు. ఈ ప్రాంత సర్వే నంబర్లను క్లాసిఫికేషన్ మార్చి రెవెన్యూ వారికి అప్పగించారు. తద్వారా ఇంటి స్థలాలు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. వీఆర్‌ఓలంతా మూడు బృందాలుగా ఏర్పడి ప్రతి వీధి సర్వే చేసి 544 మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి, లే ఔట్ వేసి, ప్రతి ఇంటికీ ప్లాట్ నంబర్లు కేటాయించారు. లబ్ధిదారుల జాబితాను నగరపాలక సంస్థ జనరల్ బాడీ ఆమోదించి ఆర్‌డీఓకు పంపగా.. వారు ఆ జాబితాలో ఉన్న 35 మందికి పట్టాలు మంజూరు చేశారు. మిగతా వారికి పట్టాలిచ్చేలోపు ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. దీంతో ప్రస్తుతం నిర్మించిన వాటర్ ప్లాంట్‌కు ఓనర్‌షిప్‌ను నిర్ధారించే పట్టా లేదనే ఏకైక కారణంతో అధికారులు కూల్చడానికి వచ్చినట్లు తెలుస్తోంది. అలా అయితే మాసాపేటలో పట్టాలిచ్చిన 35 మందికి తప్ప, మిగతా ఎవరికీ పట్టాలు లేనట్లు సమాచారం. సదరు వాటర్‌ప్లాంట్‌కు ఇదే నగరపాలక సంస్థ అధికారులు డోర్ నంబర్ కేటాయించి, ట్రేడ్ లైసెన్స్ మంజూరు చేసినా.. వాటన్నింటినీ పక్కనబెట్టి కూల్చడానికి రావడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**భారీ బందోబస్తు**

వాటర్ ప్లాంట్ కూల్చడానికి టౌన్‌ప్లానింగ్ అధికారులు రావడంతో సీఐలు రామక్రిష్ణ, బి. నాగార్జున ఆధ్వర్యంలో సుమారు 70 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఎలాగైనా వాటర్ ప్లాంటును కూల్చివేసేందుకు వారు అన్ని రకాల యత్నాలు చేశారు. సాయంత్రం 7.30 గంటల వరకూ ఇదే తరహా డ్రామా కొనసాగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు పులి సునీల్, కిరణ్, పాక సురేష్, మల్లికార్జున, కె.బాబు, సానపురెడ్డి శివకోటిరెడ్డి, సీహెచ్ వినోద్, కంచుపాటి బాబు, షఫీ, రామక్రిష్ణారెడ్డి, రెడ్డి ప్రసాద్, ఐస్‌క్రీం రవి, తోటక్రిష్ణ, షంషీర్, రామ్మోహన్‌రెడ్డి, టీపీ వెంకట సుబ్బమ్మ, రత్నకుమారి, సుశీలమ్మ, మల్లీశ్వరి, పద్మ, శివమ్మ పాల్గొన్నారు.

### పేదల నోటికాడి నీరు లాగేయడం దారుణం : మేయర్

పేదల నోటి కాడి నీరు లాగేసేలా టౌన్‌ప్లానింగ్ అధికారులు వ్యవహరించడం సరికాదని మేయర్ సురేష్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం ఆయన సంఘటన స్థలం వద్దకు చేరుకొని సీపీ, ఏసీపీలతో మాట్లాడారు. వాటర్‌ప్లాంట్ నిర్మాణం అక్రమమని భావిస్తే నోటీసులు ఇవ్వాలని సూచించారు. లేదా తహసీల్దార్, ఆర్‌డీఓల వద్దకు వెళ్లి రికార్డులు చూడాలని కోరారు. ఈ స్థలం రెవెన్యూకు సంబంధించినదని... కార్పొరేషన్ అధికారులకు ఏం సంబంధమని ప్రశ్నించారు. ఇన్నేళ్లలో కడపలో ఎప్పుడూ ఇలాంటి సంస్కృతి చూడలేదని, దళిత నాయకునికి చెందిన వాటర్‌ప్లాంట్ కూల్చడానికి ఇంత పంతమెందుకని ప్రశ్నించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఈ ప్రాంతాన్ని కేబినెట్‌లో క్లాసిఫికేషన్ మార్చి రెవెన్యూ వారికి అప్పగించామన్నారు. అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి ఈ ప్రాంతాన్ని సర్వే చేసి ప్లాట్ నంబర్లు కేటాయించారన్నారు. తద్వారా 544 మందికి ఇళ్లపట్టాలిచ్చేందుకు అనుమతులు ఇచ్చారని, తాము పండగలా బహిరంగ సభ నిర్వహించి 35 మందికి ఇళ్ల పట్టాలు కూడా మంజూరు చేశామన్నారు. మిగతా వారికి ఇచ్చేలోపు ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రక్రియ ఆగిపోయిందన్నారు. వైఎస్సార్‌సీపీ నేత త్యాగరాజుకు ఇచ్చిన స్థలంలో వాటర్‌ప్లాంట్ పెట్టుకొని పేదలకు రూ.5లకే సురక్షిత తాగునీరు ఇస్తుంటే.. దానిని కూల్చడానికి రావడం అన్యాయమన్నారు. నిరుపేద దళితులు సురక్షిత నీరు తాగకూడదా అని నిలదీశారు. దీనిపై ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి దౌర్జన్యానికి పాల్పడిన అధికారులను బోనులో నిలబెడతామని హెచ్చరించారు.

# చెరువులో పడి వ్యక్తి మృతి



నాగేశ్వరనాయక్ (ఫైల్)

మదనపల్లె : చెరువులో పడి అనుమానాస్పదంగా ఆటోడ్రైవర్ మృతి చెందిన సంఘటన గురువారం బయటపడింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దమండ్యం మండలం బండ్రేవు పంచాయితీ వంకవడ్డితండాకు చెందిన తిరుపాల్ నాయక్, సిద్దులమ్మ దంపతుల కుమారుడు నాగేశ్వరనాయక్ (45) మదనపల్లె వైఎస్ జగన్ కాలనీలో వుంటూ ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. 15 సంవత్సరాల క్రితం వివాహం కాగా, ఇతనికి భార్య ఈశ్వరమ్మ ఉండగా, పిల్లలు లేరు. జనవరి 28న రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిన నాగేశ్వరనాయక్ తిరిగి ఇంటికి రాలేదు. పలు చోట్ల గాలించినా ఆచూకీ తెలియకపోవటంతో ఈ నెల 3వ తేదీ అతని భార్య ఈశ్వరమ్మ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈక్రమంలో తట్టి వారిపల్లి చెరువులో బుధవారం ఓ మృతదేహం వున్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన జరిగిన ప్రాంతం పరిధి నిర్ధారించడంలో టూ టౌన్ పోలీసులు, తాలూకా పోలీసులు చొరవ చూపకపోవడంతో మృతదేహాన్ని బయటకు తీయడం సాధ్యం కాలేదు. గురువారం టూ టౌన్ సీఐ రామచంద్ర ఆదేశాలతో ఎస్‌ఐ రహీముల్లా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడు నాగేశ్వర నాయక్‌గా గుర్తించారు. సమాచారం కుటుంబ సభ్యులకు తెలియజేసి, మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం జిల్లా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. అనుమానస్పద స్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా మృతుడు నాగేశ్వర్ నాయక్‌కు గత కొంత కాలంగా మతిస్థిమితం సరిగా లేకపోవడంతో తిరుపతి లోని రుయా, స్విమ్స్ తదితర ఆసుపత్రిలో చికిత్సలు చేయించినట్లుగా కుటుంబ సభ్యులు ఫిర్యాదులో తెలిపారు. రాత్రి వేళలో చెరువు వైపు వెళ్లగా, అటువైపు జనసంచారం లేకపోవడంతో చెరువులో పడిన విషయాన్ని గుర్తించలేకపోయినట్లు తెలుస్తోంది.

# ఆగిన ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ

చింతకొమ్మదిన్నె : మండలంలోని జమాల్‌ఎపల్లె వద్ద గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న ట్రాక్టరును కడప నుంచి రాయచోటి వైపు సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ఇంజిన్ బోల్తా పడి, ట్రాక్టర్ డ్రైవర్ కుప్పాల జనార్దనకు తీవ్ర గాయాలయ్యాయి. పక్కనే ఉన్న బైక్‌ను ట్రాక్టర్ వేగంగా తగలడంతో బైక్‌పై ఉన్న బత్తల సుబ్బయ్యకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి బాధితులను 108 అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలించారు. జనార్దన కడప నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో, బత్తల సుబ్బయ్య కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. లారీ డ్రైవరును పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

# త్వరలో ఉద్యాన పరిశోధనలు

- రూ.25 లక్షలు మంజూరు
- రాష్ట్రంలో పూల పరిశోధనకు కేంద్రం బయ్యప్పగారిపల్లె
- డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ మాధవి



మామిడి పూతను పరిశీలిస్తున్న డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ మాధవి, శాస్త్రవేత్తలు

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండలంలోని బయ్యప్పగారిపల్లి ఉద్యాన పరిశోధన కేంద్రంలో త్వరలో పరిశోధనలు ప్రారంభం అవుతాయని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఎం.మాధవి తెలిపారు. గురువారం ఆమె కేంద్రంలో జరుగుతున్న కార్యకలాపాలను తెలుసుకునేందుకు సందర్శించారు. పరిశోధనలకు అనువైన భూమి కోసం కేంద్రంలో పని చేస్తున్న ఆగ్రానమి సీనియర్ శాస్త్రవేత్త బి.ప్రతాప్, హార్టికల్చర్ సైంటిస్ట్ జి.పూర్ణ దత్తారెడ్డితో కలిసి భూములను పరిశీలించారు. కార్యాలయంలో వారితో సమావేశమై ఇక్కడి కార్యక్రమాలపై సమీక్షించారు. అనంతరం మాధవి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో పూల పంటలపై పరిశోధనలకు బయ్యప్పగారిపల్లి కేంద్రం ఒక్కటే ఉందన్నారు. ఇప్పటి దాకా నిధులు లేక పరిశోధనలు ముందుకు సాగలేదని, ఇకపై పరిశోధనలకు వీలుగా రూ.25 లక్షలు మంజూరైనట్టు చెప్పారు. ఈ నిధులతో ఐదు ఎకరాల్లో పరిశోధనల కోసం పనులు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. ఈ ప్రాంత రైతుల కోసం పూలు, పండ్లతోటల కోసం నర్సరీలు ప్రారంభిస్తామన్నారు. కొత్త వంగడాలను సృష్టించి వైరస్‌లను తట్టుకునే విధంగా పరిశోధిస్తామన్నారు. రైతులకు టమాట సాగులో సహకారం అందించడం, నూతన విత్తనాలతో పండించేలా కృషి చేస్తామన్నారు. పండ్ల మొక్కలకు అంట్లు కట్టి రైతులకు అందిస్తామన్నారు. బి.కొత్తకోట ప్రాంతంలో క్యాబేజి, క్యాలీఫ్లవర్, బీట్‌రూట్, బఠాణి, మిరప, స్ట్రాబెర్రీ ఇలాంటి ఎన్నో పంటలను సాగు చేయొచ్చని చెప్పారు. పూల పంటలను సాగు చేసే రైతులకు శిక్షణ తరగతులు, అవగాహన కార్యక్రమాలను అమలు చేస్తామన్నారు. విశ్వవిద్యాలయం ద్వారా విద్యార్థులకు విద్య, పరిశోధన, విస్తరణ కార్యక్రమాలు నిరంతరం సాగుతుంటాయని చెప్పారు. టమాట సాగుకు సంబంధించి రైతులకు కొత్త రకం విత్తనాలు అందించేలా కృషి చేస్తామని చెప్పారు.

**పొలాల్లోకి వెళ్లండి**

పరిశోధన కేంద్రం కార్యాలయంలో శాస్త్రవేత్తలు బి.ప్రతాప్, జి.పూర్ణ దత్తారెడ్డితో సమావేశం నిర్వహించిన డైరెక్టర్ మాధవి వారికి పలు సూచనలు చేశారు. రైతులు సాగు చేస్తున్న ఉద్యాన పంటలను తరచూ పరిశీలిస్తూ, వారికి కొత్త విషయాలను తెలియజెప్పి అవగాహన కల్పించాలని కోరారు. అధిక దిగుబడులు లేక ధరలు కూడా పలికే విధంగా చేపట్టాల్సిన చర్యలు సూచించాలన్నారు. ఈ సందర్భంగా కేంద్రంలోని మామిడితోటలో చెట్లకు పూచిన పూతను పరిశీలించారు. మామిడిపై దశల వారీగా రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.

### అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

– మృతుడు హైదరాబాద్ వాసి



దీపక్‌సింగ్ (ఫైల్)

మదనపల్లె : టీ హోటల్‌లో పని చేసే టీ మాస్టర్ తాను ఉంటున్న గదిలోనే అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి మదనపల్లెలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నగరంలోని పురాణాపూల్ జియాగూడలో నివాసం ఉంటున్న కరణ్ సింగ్ నందిని దంపతుల కుమారుడు దీపక్ సింగ్(28) ఏడు నెలల క్రితం జీవనోపాధి కోసం మదనపల్లెకు వచ్చాడు. స్థానిక రెడ్డప్ప నాయుడు కాలనీ క్రాస్ రోడ్‌లో ఉన్న మిస్టర్ ఇరానీ టి దుకాణంలో మాస్టర్‌గా చేరాడు. సిటిఎం రోడ్డులో ఉన్న బిల్డింగ్‌లోని మూడవ అంతస్తులో మరో టీ మాస్టర్ సురేష్‌తో కలిసి ఉంటున్నాడు. బుధవారం రాత్రి 7:30 గంటల సమయంలో తల్లి నందినితో ఫోన్లో మాట్లాడాడు. తనకు ఆరోగ్యం సరిగా లేదని, ఛాతిలో నొప్పిగా ఉందంటూ చెప్పాడు. తల్లి స్థానిక ఆసుపత్రిలో వెంటనే చికిత్సలు పొందాలని, పరిస్థితి మెరుగవకపోతే వెంటనే హైదరాబాద్‌కు రావాల్సిందిగా సూచించింది. అయితే తర్వాత ఎనిమిది గంటల పైన తల్లి మరోసారి ఫోన్ చేయగా సమాధానం రాలేదు. విధులకు రాకపోవడంతో హోటల్ యజమాని.. దీపక్ సింగ్ ఉంటున్న గది వద్దకు సురేష్‌ను పంపారు. అక్కడికి వెళ్లిన సురేష్ గదిలో దీపక్ సింగ్ అపస్మారక స్థితిలో బెడ్‌పై పడిపోయి ఉండడాన్ని గమనించాడు. వెంటనే యజమానికి, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న టూ టౌన్ పోలీసులు దీపక్ సింగ్‌ను పరిశీలించగా.. అప్పటికే మృతి చెంది ఉండటంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. సమాచారాన్ని తెలపడంతో కుటుంబ సభ్యులు మదనపల్లికి చేరుకుని టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీపక్ సింగ్ హైదరాబాదులో ఆటో డ్రైవర్‌గా పని చేసే వాడని, కుటుంబాన్ని నిర్లక్ష్యం చేసి జులాయిగా తిరగడంతో పాటు గొడవలు జరిగాయన్నారు. దీంతో స్నేహితుడు చాంద్ బాషా సాయంతో ఏడు నెలల క్రితం మదనపల్లెకు వచ్చాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. విపరీతంగా మద్యం సేవించే అలవాటు ఉందని, అనారోగ్యానికి గురై మృతి చెంది ఉండవచ్చునని ఫిర్యాదులో తెలిపారు. దీపక్‌సింగ్ మృతికి గల కారణాలను పోస్టుమార్టం నివేదిక తర్వాత వెల్లడించగలమని సీఐ రామచంద్ర తెలిపారు. ఆ మేరకు టూటౌన్ హెడ్ కానిస్టేబుల్ సాదిక్ బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### విద్యుదాఘాతంతో సామగ్రి దగ్ధం



కాలిపోయిన సామగ్రిని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

రామాపురం : మండలంలోని రాచపల్లె పంచాయతీ గంగనేరు క్వార్టర్స్‌కు చెందిన దిన్నిపాటి రామక్క ఇంటిలో విద్యుత్ వైర్లు ఒకటికొకటి రాసుకొని వస్తువులు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.1.50 లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. రామక్క ఇటీవలే పక్కా గృహం నిర్మించుకొని, ఆమె రోజూ మాదిరి కుల వృత్తి దుస్తులు ఉతుకుటకు వాగుకు వెళ్లింది. ఆమె ఇంట్లో లేని సమయంలో విద్యుత్ తీగలు రాసుకొని పెద్ద మంటలు రగలడంతో దుస్తులతో సహా ఇంట్లోని బియ్యం, మంచం, బీరువా, నగదు, ఇంటి సామన్లు పూర్తిగా కాలిపోయాయి. గ్రామస్తుల సాయంతో మంటలను ఆర్పివేశారు. సంఘటన స్థలాన్ని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సమ్మద్‌ఖాన్, వీఆర్‌ఓ వెంకటసుబ్బారెడ్డి, వీఆర్‌ఏలు పరిశీలించి, నష్టాన్ని అంచనా వేశారు.

### అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

వేముల : వేములలో చర్చి ఎదురుగా నివాసముంటున్న షేక్ బాబాజీ(48) అనే వ్యక్తి అప్పుల బాధతో గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్.పి.కుంట మండలం గొకనపల్లెకు చెందిన షేక్ బాబాజీ వేములలో నివాసముంటున్నాడు. వేములలో ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తుండటంతో పాటు కొంత భూమిని కౌలుకు తీసుకుని అరటిని సాగు చేశాడు. అరటి సాగులో నష్టాలు రావడంతో అప్పులయ్యాయని, తీర్చే మార్గంలేక ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



# కడప గడపన మళ్లీ సాహిత్య సంబరాలు

**రేపటి నుంచి వైఎస్సార్ జిల్లా రచయితల మహాసభలు**

కడప కల్చరల్ : కడప గడపన మళ్లీ సాహిత్య ఉత్సవాలు జరగనున్నాయి. వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం గత సంవత్సరంలో ఏర్పాటైంది. తొలి విడతగా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించిన సంస్థ ప్రస్తుతం వ్యవస్థాపక అధ్యక్షులు, యోగి వేమన విశ్వవిద్యాలయం పూర్వ ఆచార్యులు, పాలకమండలి సభ్యులు మూల మల్లికార్జునరెడ్డి నేతృత్వంలో మరోమారు కడప నగరంలో రెండు రోజుల సాహిత్య సంబరాలు శని, ఆదివారాలలో నిర్వహించనున్నారు.

**మరోసారి ఉత్సవాలు**

నిన్నటి తరంలో ఈ ప్రాంతపు కవులు, రచయితలు జిల్లా రచయితల సంఘం, అభ్యుదయ రచయితల సంఘం పేరిట సంస్థలను ఏర్పాటు చేసుకుని విజయవంతంగా కార్యక్రమాలను నిర్వహించారు. ఆ తర్వాత ఈ రంగంలో స్తబ్ధత ఏర్పడింది. మరికొన్నాళ్ల తర్వాత బాధితులే రచయితలై అత్యంత సహజంగా కథలను పండించారు. సరిగ్గా ఇదే సమయంలో కడప నగరంలో డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో యోగివేమన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. అందులోని సాహితీవేత్తలు తొలి దశ నుంచి తమదైన శైలిలో భాష సాహిత్యాభివృద్ధికి కృషి చేసి ఆ శాఖకు పేరు గడించి పెట్టారు. ఇదే సమయంలో బ్రౌన్ గ్రంథాలయ నిర్మాత డాక్టర్ జానమద్ది హనుమత్‌శాస్త్రి, విద్వాన్ కట్టా నరసింహులు, ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి ఈ రంగంలో ఆసక్తి, ప్రజ్ఞ గల వారిని ఎంతగానో ప్రోత్సహించి నూతన రచయితలుగా తయారయ్యేందుకు స్ఫూర్తినిచ్చారు.

**ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు**

నూతన రచయితలు అస్తిత్వ పోరాటాల ఫలితాలను అత్యంత సహజమైన కథలుగా తీర్చిదిద్దారు. దాంతో వారికి విశేషమైన పేరు ప్రఖ్యాతులు లభించాయి. వారి కథలతో సినిమాలు తీస్తామని నిర్మాతలు, దర్శకులు ముందుకురావడం విశేషం. ఇలాంటి దశలో వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం ఏర్పడడం పట్ల సాహిత్యాభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తగినట్లు నిర్వాహకులు ఈ నెల 8, 9 తేదీలలో సభలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రాచీన తరానికి చెందిన శ్రీకృష్ణదేవరాయలతోపాటు నేటితరానికి చెందిన ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి పేరిట కూడా ప్రత్యేకంగా 16 వేదికలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఉత్సవాలలో మరికొన్ని ప్రత్యేకతలను మనం చెప్పుకోవాలి. ఈ రెండు రోజుల సభలలో మొత్తం 16 పుస్తకాలను ఆవిష్కరించనున్నారు. ప్రతిరోజు 8 విభాగాలుగా సదస్సులను నిర్వహిస్తారు. రాయలసీమలోని అన్ని ప్రాంతాల నుంచి 120 మందికి పైగా కవులు, రచయితలు ఈ సభలకు హాజరు కానున్నారు. పాల్గొనే వారు వెయ్యేళ్ల తెలుగు సాహిత్యం–రాయలసీమ భాగస్వామ్యం అంశంపైనే దృష్టి సారించనున్నారు. వీరితోపాటు కళాశాల నుంచి ఎంపిక చేసిన 154 మంది విద్యార్థులు ఈ సభల్లో రెండు రోజులపాటు వేదికలపై తమ కవిత్వాన్ని వినిపించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ సభల్లో ప్రముఖ సాహితీవేత్తలు ఆచార్య వెలుదండ నిత్యానందరావు, డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్, ఆచార్య శలాక రఘునాథశర్మ, ప్రముఖ శతావధాని డాక్టర్ నరాల రామారెడ్డి, సినీ నటులు శివకృష్ణలతోపాటు రాయలసీమ నలుమూలల నుంచి హాజరు కానున్నారు.

# త్వరితగతిన ఆర్‌యూబీలు నిర్మించండి

- కడప–రేణిగుంట లైన్‌లో రైల్వే గేట్లు ఉండవిక!
- గుంతకల్లు డీఆర్‌యూసీసీ సభ్యుడు తల్లెం భరత్‌రెడ్డి



ఆర్‌యూబీ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న డీఆర్‌యూసీసీ సభ్యుడు తల్లెం భరత్‌రెడ్డి

రాజంపేట : గుత్తి–రేణిగుంట రైలు మార్గంలో రైల్వే గేట్లు ఇక ఉండవని, ఆదిశగా రైల్వేబోర్డు వంతెన నిర్మాణాల ప్రణాళికలతో ముందుకు పోతోందని, భవిష్యత్తులో గేట్ల సమస్య ఉండదని, ఇప్పటికే రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి కృషితో ఆర్‌యూబీ నిర్మాణాలు సాగుతున్నాయని గుంతకల్ డీఆర్‌యూసీసీ సభ్యుడు తల్లెంభరత్‌రెడ్డి అన్నారు. గురువారం గుంతకల్ రైల్వే డీఈఎన్ అభిరామ్‌తో కలిసి సెక్షన్‌లోని పలు ఆర్‌యూబీ నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కడప–రేణిగుంట రైలుమార్గంలో సమస్యలు ఉత్పన్నం కాకుండా ఆర్‌యూబీ(రోడ్ అండర్ బ్రిడ్జి)లను నిర్మించాలని డివిజన్ ఉన్నతాధికారులను కోరారు. నాసిరకంగా ఆర్‌యూబీ నిర్మాణాలు జరిగితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి కృషి ఫలితంగా రైల్వేకోడూరు దశాబ్దాలుగా ఉన్న రైలుపట్టాలు క్రాస్ జర్నీ సమస్యకు తెరపడిందన్నారు. ఆర్‌యూబీ నిర్మితం కావడంతో అనేక పల్లెలకు మార్గం సుగమమైందన్నారు. రామయ్యపురం ఎల్‌సీ గేట్ 87 వద్ద ఆర్‌యూబీ నిర్మాణ పనులు పూర్తి కావస్తున్నాయన్నారు. భవిష్యత్తులో ఈ ఆర్‌యూబీలో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఆర్‌యూబీల నిర్మాణంలో నీళ్లు నిలబడటం వల్ల రాకపోకలు ఆగిపోతున్నాయన్నారు. ఈ పరిస్థితి అనేక ఆర్‌యూబీల వద్ద ఉంటోందన్నారు. నందలూరు, రైల్వేకోడూరు తదితర ప్రాంతాల్లో వున్న ఆర్‌యూబీ నిర్మాణాలలో కూడా నీటి నిల్వ లేకుండా ముందస్తుగా నిర్మాణాలు చేపట్టాల్సి ఉందన్నారు. త్వరితగతిన ఆర్‌యూబీ నిర్మాణాలు పూర్తి చేయడం వల్ల గేట్ల సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో బుడుగుంటపల్లె సర్పంచి చంద్రశేఖర్, కోడూరు సర్పంచి మురిగి శివయ్య, ఏపీ టూరిజం డైరెక్టరు మందల నాగేంద్ర, నాయకులు శ్రీనివాసులు, ఫరూక్, శంకరయ్య, కాంట్రాక్టర్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.